క్లుప్తంగా

జాతీయ ఫైరింగ్ పోటీలకు వంశీ ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలో ఈ నెలాఖరులో జాతీయస్థాయిలో జరగనున్న ఫైరింగ్ పోటీలకు టీజేపీఎస్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫైరింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి కె. వంశీ జాతీయి స్థాయికి ఎంపిక కావడం గర్వకారణని పేర్కొన్నారు. విద్యతో పాటు ఎన్‌సీసీలో చురుగ్గా పాల్గొనే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతుండటంతో జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి వంశీని కె.వి. బ్రహ్మంతో పాటు కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ పి. కుమార్‌రాజా, వైస్ ప్రిన్సిపాల్ పి. భానుమురళి, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.వి. సుధీర్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

అద్దె బకాయిల వసూలుపై స్పెషల్ డ్రైవ్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దె బకాయిలు కోట్ల రూపాయల్లో పెండింగ్‌పై అదనపు కమిషనర్ కె. రాజ్యలక్ష్మి సీరియస్‌గా ఉన్నారు. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్న షాపుల నుంచి ఈ నెల 26వ తేదీలోగా బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్స్, రెవెన్యూ ఆఫీసర్స్, డెప్యూటీ కమిషనర్స్‌కు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 500 దాకా షాపులు ఉన్నాయి. వీటిల్లో సుమారు రెండు కోట్ల రూపాయలకు పైచిలుకు బకాయిలు పేరుకుపోయాయి. వీటి వసూలుకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను రాజ్యలక్ష్మి ఆదేశించారు. ప్రతి రోజు సాయంత్రం వసూళ్లపై రివ్యూ మీటింగ్ నిర్వహించాలని డెప్యూటీ కమిషనర్లను ఆమె ఆదేశించారు.

అనాథ ఆశ్రమానికి వాషింగ్ మిషన్ వితరణ



గుంటూరు మెడికల్: అల్బీనా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏటుకూరులోని పిల్లల అనాథ ఆశ్రమానికి వాషింగ్‌మిషన్‌ను బుధవారం వితరణగా అందజేశారు. ట్రస్టు సభ్యుల సహకారంతో పిల్లలకు వాషింగ్‌మిషన్ అందజేశామని నిర్వాహకులు జాలాది సెల్వరాజ్ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



లక్ష్మీపురం: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సుమారు 55 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండటం గమనించి ఇటీవల రైల్వే జీఆర్పీ పోలీసులు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆచూకీ తెలిసిన వారు 9440627546, 9550523485 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

వైభవంగా శ్రీదత్తసాయి ప్రేమ మందిర ప్రతిష్ట వార్షికోత్సవం



ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం ప్రతిష్ట వార్షికోత్సవం బుధవారం ఘనంగా ఆరంభమైంది. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఉదయం ఆరు గంటలకు పతాకావిష్కరణ చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలను జరిపించారు. ఉదయం 8 గంటల్నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదాయ భజనలు నిర్వహించారు. భజనల అనంతరం హైదరాబాద్‌కు చెందిన సంపత్‌కుమార్‌తో సంకీర్తనలు జరిగాయి. అనంతరం సంపత్‌కుమార్, వాద్య సహకారం అందించిన మోదుకూరు నగధర్‌కుమార్, ఆంజనేయశాస్త్రిని నిర్వాహకుడు కొర్రపాటి వెంకటేశ్వరరావు సత్కరించారు. ఈమనిలోని శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, కొర్రపాటి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు

నగరంపాలెం: పాత గుంటూరులోని మాయా బజార్ నుంచి హిందూ కళాశాల వరకు ఏర్పాటు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారంటూ బుధవారం జనసేన నాయకులు ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలి

ఎమ్మెల్యే గళ్లా మాధవి



రవీంద్రనగర్‌లోని జీఎంసీ హైస్కూల్లో విద్యార్థినికి స్టూడెంట్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టపడి చదివి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. కొరిటిపాడులోని ఎస్ఆర్ఎంవో ఎయిడెడ్ హైస్కూల్, రవీంద్రనగర్‌లోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఆమె స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన బోధన, వసతుల్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులు కూడా నాణ్యమైన బోధన చేయాలని ఆమె చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావు, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, జ్యోతికిరణ్, మాజీ ఎమ్మెల్సీ ఏ.ఎస్. రామకృష్ణ, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, మాజీ కార్పొరేటర్ మాగంటి సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామమాత్రపు ఫీజులతో పేదలకు కార్పొరేట్ వైద్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని నామమాత్రపు ఫీజులకు అందించాలనే లక్ష్యంతో కేవలం రూ. 10లకే ఓపీ వైద్య సేవలు అందిస్తున్నామని సీనియర్ గైనకాలజిస్ట్, హోప్ విన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా అన్నారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని హాస్పిటల్స్‌లో బుధవారం ఓపీ పోస్టర్‌ను తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక ఓపీ క్లినిక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ నజీరుద్దీన్, మేనేజర్ పి.నాగేశ్వరరావు, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ బషీరుద్దీన్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కాలిన గాయాల బాధితులకు ప్రత్యేక వార్డు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో కాలిన గాయాల బాధితులకు ప్రత్యేక వార్డును కేటాయిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఎన్టీఆర్ యూనివర్సిటీలో డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ సుమితా శంకర్ జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను డాక్టర్ కిరణ్ కుమార్ అభినందించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యం అందించే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఆధునిక, సంక్లిష్టమైన ఆపరేషన్‌లు చేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. త్వరలోనే కమర్షియల్ క్యాంటిన్ స్థానంలో కాలిన గాయాల బాధితులకు చికిత్స వార్డును కేటాయించి 20 పడకలు అందుబాటులోకి తీసుకుని వస్తామని చెప్పారు. ఈ వార్డులో అన్ని వసతులు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి అనుబంధంగా కేటాయిస్తున్నామని తెలిపారు. జనరల్ సర్జరీ విభాగం వైద్యుల సహకారం తీసుకుని ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని రాష్ట్రంలోనే అత్యున్నత స్థాయి గా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు

గుంటూరు రూరల్: ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ చౌడవరం సెక్టార్ సూపర్‌వైజర్ బి. జ్యోతి సూచించారు. బుధవారం చౌడవరం గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి తల్లులకు వివరాలను వెల్లడించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం షాలిని, ఎంఎస్‌కె బి.మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీరాంజమ్మ, టీచర్ శోభరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణకుమారి, ధనలక్ష్మి, హేమలత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డ గ్రామంలో...

జొన్నలగడ్డ గ్రామంలోని మెయిన్ ఏరియా సెంటర్‌లో బుధవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్లు మాలతి, జ్యోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సకల సదుపాయాలు

తెనాలి అర్బన్: సకల సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తెనాలి మండల విద్యాధికారి-2 వి.జయంతిబాబు కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేను బడికి పోతా కార్యక్రమాన్ని బుధవారం చెంచుపేటలో నిర్వహించారు. బడి- ఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు నుంచి 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరూ బడిలో చేరే విధంగా చూడటమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. బడి మానేసిన పిల్లలనే తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చూస్తామన్నారు.

26న బీజేపీ అభ్యర్థులకు అభినందన

గుంటూరు మెడికల్: ఎన్నికల్లో బీజేపీ తరఫున గెలుపొందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులకు ఈనెల 26న విజయవాడలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు యలవర్తిపాటి పాండురంగ విఠల్ బుధవారం తెలిపారు. సాయంత్రం 3 గంటలకు వెన్యూ కన్వెన్షన్‌లో జరిగే అభినందన సభలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



నగరంపాలెం: లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామికి దశావతారం అలంకారం చేశారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, 108 కలశాలలతో అష్టోత్తర కలశ స్నపన అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నగర పుర వీధుల్లో హంస వాహనంపై గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి. ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ చంద్రకుమార్ పాల్గొన్నారు.

షాపు యజమానిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలుడితో షాపులో పని చేయిస్తున్న యజమానిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..అరండల్‌పేట 1వ లైనులోని బిస్మిల్లా స్పేర్ పార్ట్ షాపులో యజమాని నరేంద్ర ఓ బాలుడితో పని చేయిస్తున్నాడు. ఈ ఘటనపై చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ జిల్లా కో- ఆర్డినేటర్ కె.షమీర్ కుమార్ బుధవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



హరిణి ప్రియాంక



విజయలక్ష్మి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గాల్ని చూపడం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంనందున్న కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం గత నెల 29న వివిధ కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయదలచుకున్న విద్యార్థులకు నిర్వహించిన పీజీ సెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. కళాశాల నుంచి 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 39 మంది మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వీరిలో సీహెచ్. హరిణి ప్రియాంక రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు, ఎ. విజయలక్ష్మి 32వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 100లోపు ఎనిమిది మంది, 1000లోపు 30 మంది ర్యాంకులు వచ్చినట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థుల్ని చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు అభినందించారు.

సమస్త జీవరాశుల్లోనూ భగవంతుడు



ప్రవచనం చేస్తున్న సువీరానందస్వామి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై బుధవారం భగవద్గీతలోని జ్ఞాన యోగం పై సువీరానందస్వామి బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సువీరానందస్వామి ప్రసంగిస్తూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో మాట్లాడుతూ సూర్యచంద్రుల్లోని కాంతిని, వేదాల అన్నింటిలో ఓంకారం తానే అన్నారని తెలిపారు. పురుషుల్లో పౌరుషం, అగ్నిలో తేజస్సు, తాపసులలో తపస్సును కూడా తానే అని పేర్కొన్నారని వివరించారు. సమస్త జీవ రాశులలో తాను ఉన్నానని భగవాన్ శ్రీకృష్ణుడు తెలిపారని భక్తులకు బోధించారు.

ఏపీ పీజీఈ సెట్ ఫలితాల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



డి.రసజ్ఞ



డి.సాయికృష్ణ



బి.ఇందిర



రత్నశ్రీ



సీహెచ్. హర్షవర్ధన్



జి.ఉమా మహేశ్వరరావు

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీఈ సెట్ 2024 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఎంఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించే ఈ పరీక్షకు కళాశాల నుంచి 70 మంది హాజరుకాగా.. 67 మంది అర్హత పొందటమే కాకుండా 200లోపు ర్యాంకులు ఆరుగురు సాధించారన్నారు. అందులో డి. రసజ్ఞ 32వ ర్యాంక్, డి సాయి కృష్ణ - 88, బీ ఇందిర - 115, జీ ఉమామహేశ్వర రావు - 160, చెరుకూరి హర్ష వర్ధన్, రత్నశ్రీలు 211వ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణలు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



చుండూరు గురుకుల పాఠశాలలోని వసతి గృహంలో మలాథియన్ స్ప్రే చేస్తున్న సిబ్బంది పక్కన అధికారులు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా మలేరియా కార్యాలయాధికారి జి.రాంబాబు, బాపట్ల పట్టణ హెల్త్ సెంటర్, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది పాఠశాలను సందర్శించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహంలోని అన్ని గదులలో దోమల నివారణకు మలాథియాన్, లార్వా సైడ్ మందులను స్ట్రిప్ పంపుల ద్వారా ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేశారు. అలాగే వంట శాలలోని గదులను, వంట పాత్రల పరిశుభ్రత, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, వసతి గృహం ఆవరణలో నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మీనారాయణతో చర్చించారు. అదే విధంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి దోమ కాటు వలన వచ్చే కీటకజనిత వ్యాధులను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక వైద్యశాలలో సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని కోరారు. వంట పాత్రలపై మూతలు తప్పని సరిగా ఉంచాలని డయేరియా, వాంతులు, విరోచనాలు, పచ్చకామెర్ల వంటివి నీరు, ఆహారం, ఈగలు ద్వారా ప్రబలుతాయని వివరించారు.

రోగులకు వెన్నుదన్ను

- వెన్నెముక పరిశోధనలపై అంతర్జాతీయ అవార్డులు అందుకున్న డాక్టర్ నరేష్‌బాబు
- 25 అంతర్జాతీయ, 25 జాతీయ అవార్డులు సొంతం
- గుంటూరుకు ప్రపంచవ్యాప్త గుర్తింపు



అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్: వెన్నెముక సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్సలు అందించడమే లక్ష్యంగా గుంటూరుకు చెందిన మల్లికా స్పైన్ సెంటర్ అధినేత, సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ జంబులదిన్నె నరేష్‌బాబు పరిశోధనలు చేస్తూ అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. 2024 సంవత్సరానికి గాను వైద్య రంగంలో ప్రతిష్టాత్మకమైన రెండు అంతర్జాతీయ అవార్డుల్ని రెండు నెలల వ్యవధిలో అందుకున్నారు.

చదువుకునే రోజుల నుంచే పరిశోధనలపై మక్కువ

డాక్టర్ జె.నరేష్‌బాబు వైద్య కళాశాలలో చదువుకునే రోజుల నుంచే పరిశోధనలపై మక్కువ చూపించేవారు. ఆమె తల్లి డాక్టర్ ఓలేటి శివలీల గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. ఆయన తండ్రి డాక్టర్ జె.రంగస్వామి గుంటూరు జీజీహెచ్ రేడియోఫిజిక్స్ ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. వీరికి రెండో కొడుగా జన్మించిన డాక్టర్ నరేష్‌బాబు గుంటూరు వైద్య కళాశాలలో 1991లో ఎంబీబీఎస్, 1998లో ఆర్థోపెడిక్‌లో పీజీ చదివారు. విజయవాడలోని హెల్త్ యూనివర్సిటీ 2002లో బెస్ట్ అవుట్‌గోయింగ్ ఆర్థోపెడిక్ స్టూడెంట్‌గా అవార్డు అందజేసింది. వెన్నెముక సమస్యలపై 2002 నుంచి 2005 వరకు కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రిలో ప్రత్యేక శిక్షణ పొందారు. 2005 నుంచి 2006 వరకు సింగపూర్‌లోని నేషనల్ యూనివర్సిటీలో, 2007లో అమెరికాలోని చికాగోలో, 2008లో తైవాన్, సౌత్ కొరియా, జపాన్‌లలో వెన్నెముక చికిత్సలపై పలు సూపర్ స్పెషాలిటీ కోర్సుల్ని అభ్యసించారు.

2002లో తొలి అవార్డు

పరిశోధనలపై ఎక్కువ దృష్టి సారించిన డాక్టర్ నరేష్‌బాబు కాళ్లల్లో ఓపెన్ ఫ్యాక్చర్స్‌పై పరిశోధన చేశారు. కాలు విరిగి చర్మం బాగా దెబ్బతిన్న వారిపై చేసిన పరిశోధనలకు గాను 2002లో మొట్టమొదటిసారిగా యతిరాజులు గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. నాటి నుంచి ఏటా పరిశోధనలు చేస్తూ రోగులకు మెరుగైన చికిత్సలు అందించడానికి కృషి చేస్తున్నారు. ఆయన ప్రతిభకు గానూ ఇప్పటి వరకు 25 అంతర్జాతీయ, 25 జాతీయ అవార్డులు లభించాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో థామస్ వైట్ క్లాడ్ అవార్డు లభించడంతో గుంటూరు వైద్య రంగ ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతోంది.

స్టాండింగ్ ఎమ్మారైతో పరిశోధనలు

వెన్నెముక సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించేలా సౌత్ ఇండియాలో ఎక్కడా లేని విధంగా స్టాండింగ్ ఎమ్మారై వైద్య పరికరాన్ని తమ ఆసుపత్రిలో డాక్టర్ నరేష్ బాబు అందుబాటులోకి తెచ్చారు. దీనికి గానూ ఆయన థామస్ వైట్ క్లాడ్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. తరచూ సర్వేకల్ స్పాండిలైటిస్ మెడనొప్పి, చెయ్యి బలహీన పడడం, నడక తడబడడం వంటి లక్షణాలు ఉన్నప్పటికీ, ఎమ్మారైలో వెన్నెముకపై ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండటాన్ని తాము గమనించామని, ఇదే విషయాన్ని పరిశోధన పత్రంగా సమర్పించడంతో అంతర్జాతీయ అవార్డు లభించిందని ఆయన వివరించారు. ఏడాది పాటు తమ ఆసుపత్రిలో దీనిపై పరిశోధన చేసినట్లు వెల్లడించారు.

డిస్క్ సమస్యలపై పరిశోధనకు అవార్డు

వెన్ను సమస్యలపై ప్రపంచానికి ఇప్పటి వరకు తెలియని విషయాన్ని డాక్టర్ నరేష్‌బాబు వెలుగులోకి తెచ్చారు. వెన్నులోని డిస్క్‌లకు పోషక పదార్థాలు అందే విధానాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించారు. మనిషి నిలబడినప్పుడు శరీరం బరువు వల్ల డిస్క్ మధ్యలో ఉండే పోషక పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. పడుకున్న సమయంలో తిరిగి వస్తాయి. గతంలో కంటే అధిక మొత్తంలో పోషక పదార్థాలు వస్తున్న విషయాన్ని ఇప్పటి వరకు ప్రపంచంలో ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ ప్రయోగం నడుము నొప్పి నివారణ, చికిత్సకు ఎంతో ఉపయోగం జరగనుంది. గత నెల 30న ఇటలీలోని మిలాన్‌లో జరిగిన అంతర్జాతీయ లంబార్ స్పైన్ అధ్యయన సంస్థ 50వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఇందులో డాక్టర్ నరేష్‌బాబుకు ఈజిల్స్ ప్రైజ్ అంతర్జాతీయ అవార్డును అందజేశారు. దీనితో 20వేల అమెరికన్ డాలర్స్ బహుమతిగా అందజేశారు. పరిశోధన పత్రాన్ని అంతర్జాతీయ యూరోపియన్ జర్నల్‌లో ప్రముఖంగా ప్రచురించారు.

గురువు స్ఫూర్తితో పరిశోధనలు



కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్‌కు చెందిన సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ రాజశేఖరన్ స్ఫూర్తితో వెన్నెముక పరిశోధన చేస్తున్నా. పీజీ వైద్య విద్య పూర్తి కాగానే ఆయన వద్ద శస్త్రచికిత్సల్లో మెలకువలు నేర్చుకున్నాను. ఒక పక్క రోగులకు సేవలందిస్తూనే మరోపక్క మెరుగైన వైద్య సేవలు తక్కువ వ్యయంతో అందించాలనే లక్ష్యంతో ప్రయోగాలు చేస్తున్నా. గుంటూరు జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యపై కూడా పరిశోధనలు చేసినందుకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ఇండియాలో ఇప్పటి వరకు ఎవరూ అందుకోని అంతర్జాతీయ అవార్డులు 2024లో ఒకేసారి రెండు లభించడం నా జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేను.

– డాక్టర్ ఎస్. నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్

శివాజీ చిత్రపటం వద్ద నివాళి

ఐలవరం(భట్టిప్రోలు): హిందూ సామ్రాజ్య దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఎస్ఎఫ్ భట్టిప్రోలు మండలం ఐలవరంలో బుధవారం ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, సహ కన్వీనర్ వి.కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ ఎం.రంగారావు, పి.నాగులు, జి.జగన్‌మోహన్‌రావు, డి.శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ కె.వాణి పాల్గొన్నారు.

అందరి ఆరోగ్య పరిరక్షణకు కృషి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గరుడాచలపాలెంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి దోమకాటు వల్ల వచ్చే రోగాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఎంపీహెచ్‌మేల్ బాబావలి, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.